# రాలిన తార

నానిగాడితో బంతి ఆడ్డం తమాషా కాదు. దూరంగా వెయ్యకూడదు దగ్గిరగా వెయ్యకూడదు. నేలబారుగా వెయ్యకూడదు. పైకి ఎత్తుగానూ వేయకూడదు. ఓ అరగంట యిలాంటి నిబంధనలతో ఆడేసరికి కృష్ణమూర్తికి ఎక్కడ లేని అలసటా వచ్చింది. నెమ్మదిగా వాణ్ణి తప్పించుకుని వంటింట్లో తలదాచుకుందుకు జారుకున్నాడు.

చేస్తూన్న పని ఆపకుండానే "చెప్పావా?" అంటూ అడిగింది పార్వతి ఈ భార్యలకి ఏం చెవులుంటాయో — ఏం చప్పుడు చెయ్యకపోయినా భర్త నిల్చే పసికట్టేస్తారు — అనుకున్నాడు కృష్ణమూర్తి. "నానిగాడికి చెప్పావా—" అని పార్వతి ప్రశ్న. వీధివాకిలిలోంచి నానిగాడూ వాడి స్నేహితులూ చేస్తూన్న అల్లరి చిన్నఎత్తు భూకంపంలాగా వినిపిస్తూంది. "మన పెరట్లో దారితప్పిన పిల్లులుకీ పిల్లలకీ కొరత లేదు" అనుకుంటూ పార్వతి దగ్గిరగా నడిచాడు కృష్ణమూర్తి ఏం చేస్తుందో చూడాలన్న కుతూహలంతో.

"నేనేం చెప్పనోయ్ వాడికి? వాడే నాకంటే బాగా బంతి ఆడుతున్నాడు." బూర్లెమూకుడులో ఉల్లితో కూర పెట్టిన కాకరకాయలు దోరగా వేగుతున్నాయి.

"ఏం చెప్పాలన్నానో మహా తెలియనట్టు! నే చెప్ప చెప్పమన్నట్టు చెప్పావా? నానిగాడికి యింకో పాప వస్తూన్న సంగతి చెప్పకపోతే ఎలా కృష్ణా?" జాలిగా అడిగింది పార్వతి.

"చెప్పానోయ్ పార్వతీ. వచ్చే గణపతి చవితినాటికి నీకో తమ్ముడు తోడు వస్తాడు - చెల్లాయి అయితే చెప్పలేం అని చెప్పాను." నిట్టూర్చాడు కృష్ణమూర్తి. నుదుటపట్టిన చిరు చెమటలు వంగి భార్య చీరచెంగుతో సుతారంగా వత్తుకున్నాడు.

"అంతేనా? నానిగాడలా అంటే ఊరుకున్నాడా? కొంచెం కుతూహలమేనా కనపర్చలేదా?" అడిగింది పార్వతి నమ్మలేనట్టు.

"అడిగాడు డడిగాడు. ఆ వచ్చేవాడెలా వేస్తాడు బంతి. నీలా ఎడం చేత్తోనా, అని అడిగాడు. ఇంతట్లో మాట మారిపోయింది పార్వతీ" అన్నాడు కృష్ణమూర్తి జాలిగా ముఖం పెట్టి.

ఏం చేయలేక చేతులు విదిలించి జుట్టువిప్పి తిరిగి గట్టిగా పైకి కొప్పు పెట్టుకుంది పార్వతి.

"నీతో గొడవవచ్చిపడింది. పిల్లలెలాపుడతారని వాడు నిలవేసి అడక్కుండా కదా నిన్ను ముందరే వాణ్ని ప్రిపేర్ చేయమంట!" పైకి కనిపించని చిలిపినవ్వు తాలూకు మెరుపు కృష్ణమూర్తి కళ్ళలో మెరిసింది. వంటయింటి కిటికీలోంచి పచ్చనిఎండ లోపలికి పడుతూంది. ఆ ఎండ వెల్లువలో పార్వతి నిత్యయావ్వనవతి లాగా కన్పడింది కృష్ణమూర్తికి. భుజంమీద చెయివేసి దగ్గరికి లాక్కోబోయాడు.

"దీనికేం లోటులేదు. పోనీ మన సైకాలజీ ఫ్రెండు చేత చెప్పిస్తానంటే అదేం అక్కర్లేదు, నేనే చెప్పేస్తానన్నావే మహా" అంటూ మూతివిరిచింది పార్వతి.

"ఈ విషయాలు పైవాళ్ళెందుకు చెప్పడం; మనం చెప్పలేమూ అనుకున్నాను పార్వతీ, నానిగాడు అడిగితే చెప్పేవాణ్నే."

"ఏమనీ? అంటూ నవ్వేసింది పార్వతి- హెల్ప్‌లెస్‌గా తలలో వేళ్ళు పోనిచ్చి బాధగా ముఖంపెట్టిన కృష్ణమూర్తిని చూస్తే జాలివేసింది.

డైనింగు టేబిలు దగ్గిర కుర్చీ నొకదాన్ని ఇవతలకిలాగి కూర్చున్నాడు కృష్ణమూర్తి.

"పోనీ అంటే చెప్పలేదుగా ఇప్పుడు నానిగాడికి ఏ అసూయలో ఉద్భవించి ఏ జెంగో పట్టుకుంటే."

"నీకు మరీ పిరికితనం పార్వతీ. వాడికి చెప్తేమటుకు ఏం అవుతుందనీ? నేను వాడి వయస్సులో ఉన్నప్పుడు ఇలాంటివి ఎప్పుడూ ఆలోచించలేదు. పిల్లలెలా వస్తారో నాకప్పుడు బాగా తెలుసు డాక్టరు తన పెట్టెలో పెట్టి తీస్తాడు!" భార్య ముఖంలోకి చూస్తూ ఊరుకున్నాడు కృష్ణమూర్తి.

"ఈ రోజుల్లో అలా నమ్మిస్తే తరువాత పిల్లలకి మానసికమైన దుర్బలాలనేకం రావచ్చు నంటారుగా?" తనూ ఓ కుర్చీ లాక్కొని కూర్చుంటూ అంది పార్వతి. అలసిన ఆమె ముఖంలో కళ్ళు వింతగా వెల్గుతున్నాయి. తల్లి కాబోయే స్త్రీ మనస్సులోని ఉత్సాహాన్ని కవి నిదర్శనాలుగా ఉన్నాయి

"నీ ముఖం. అవేం జరగలేదేం నాకు!...డాక్టర్లంటే గౌరవం పెరిగిందే కాని — యీ నాటిదాకా తరగలేదు నాకు. ఈ రోజు ఆ నల్ల పెట్టెల్లో మాత్రలూ, ఇంజక్షన్లూ థర్మామీటర్లు తప్పించి ఏం ఉండవని చెప్పి నా నమ్మకం వమ్ముచేయకేం!" నవ్వుతూ వంగి పార్వతి చేయి అందుకుని తన రెండు చేతుల్లో పెట్టుకున్నాడు కృష్ణమూర్తి.

"నువ్వదృష్టవంతుడివి, అలాంటి ఆలోచనలు బుర్ర లోకి వస్తే నీ జీవితం పూర్తిగా నాశనమైపోయేదని వాపో కలదు—సరస్వతమ్మగారి మేనకోడలు. ఆవిడిగారి సైకాలజీ డాక్టరేటుకది అవమానంగా భావించకల్దు, జాగ్రత్త" అంది పార్వతి,

వంట మధ్యలో కూడా పార్వతి చేతులు శుభ్రంగా అందంగా ఉన్నాయి. అందుకే చదువుకున్న భార్య లుండా లని అనుకున్నాడు కృష్ణమూర్తి. వాళ్ళకి రొమాన్సు విలువ తెలుస్తుంది. చేతిలో గరిట కిందపడేసి అమాంతం భర్త మెడని రెండు చేతులా కౌగలించుకోగలరు. మసీ గిసీ అంటుకోదు!...

"పోనీ ఈ రోజు సెలవే కదా. సాయంత్రం అలా వెళ్దాం మాటల సందర్భంలో యీ సంగతి చెప్పిస్తాను" చేయి తీసు కుందుకు యత్నిస్తూ అంది పార్వతి.

"నేనూ రావాలా? బ్రిడ్జికి వస్తానన్నానే! ఎలా" చేయి ఒక్క ఉదుటున లాగేసుకుంది పార్వతి.

"పిల్లల భవిష్యత్తుకే పునాదుల్లాంటివి చర్చించడం కంటే బ్రిడ్జే ముఖ్యమా నీకు—పోనీలే నేనే వెడతాను" అప్పుడే పార్వతి కళ్ళు నీటిపొరతో కమ్ముకున్నాయి.

"ఛ ఛ, రానని చెప్పేస్తాగా—పోనీ అక్కణ్ణించి అలా బీచీకి వస్తావా? ఎన్నాళ్ళయింది మనం ఇసకలో నడిచి" ప్రాధేయపడుతున్నట్టు అడిగాడు కృష్ణమూర్తి.

లేచి వచ్చి కృష్ణమూర్తి తలని తన గుండెల కదుము కొంది పార్వతి.

"నిజమే కృష్ణా. యీ సంసారం కోసం మనం ఎంతో వదులుకున్నాం... నే నా సంగతి మరిచిపోయానని అనుకుం టున్నావా?"

"లేదు పార్వతీ, మనం వదులుకున్న దానికంటే ఎక్కువే పొందకల్గుతున్నాం. బాబిగాడ్ని కడుపుతోనున్నప్పుడు మనం ఎంతో బెంగ పడ్డాం రోమాన్సుకి స్వస్తి అని. కాని ఏమైంది? నువ్వు నేనూ యింకా సన్నిహితం అయిపోలేదా! ఇంకా ప్రేమలో లోతులు చూడలేదా? నానిగాడు వస్తే మనం ఆనందించాం మన మధ్య బాధ్యతతో పాటు ప్రేమ బల పడింది. ఇప్పుడు మటుకిం కేంముంది? ఈ వూపు పూ స్తే ఇక మనం శాశ్వతంగా ప్రేమ పక్షులం అయిపోతాం కదూ? ముగ్గుర్నీ పెంచుకుంటూ మనం ముసలివాళ్ళం అయిపోతాం. అంతేకదూ?" పార్వతి నడుం చుట్టూ చేతులు వేసి దగ్గరికి లాక్కున్నాడు కృష్ణమూర్తి.

"లేదు కృష్ణా, మనం ముసలివాళ్ళం అవం. మనస్సుకి లేని ముసలితనం ఎక్కణ్నుంచి తెస్తావు? ... సరేగాని ఈ రోజు వెళ్ళి మాట్లాడాలి" అంది కౌగిలి విదిలించుకుని — మళ్ళీ ప్లేటు కేసి నడుస్తూ.

క్షణం క్రిందట చదువుకున్న భార్య కావాలనుకున్న కృష్ణమూర్తి కి క్షణంలో చదువుకున్న భార్యలతో ఇదే చిక్కనిపించింది. దేన్నీ వాళ్ళు మామూలు మాజికల్ గా వదిలెయ్యలేరు. శల్యపరీక్ష చేసి శాస్త్రీయమైన నిర్వచనం ఇవ్వాలని సతమతమైపోతారు." అనుకుంటూ లేచి ముందు గదిలోకి పడిచాడు.

ఎలాగో సాయంత్రం అయింది. సెలవురోజున నాని గాడసలు భోజనానికీ దానికీ తప్పించి యింట్లోకి రాడు. వాడికంతపని వుంటుంది. సాయంత్రం—సైకాలజిస్టు స్నేహితురాలింటికి వెళ్ళడానికి సిద్ధం అవుతోంది పార్వతి. పక్కింటికి చక్కెరకి అప్పుకెళ్ళినా, బాధతో డాక్టరింటికి పరుగెత్తాలన్నా నరే ఆడవాళ్ళ అలంకరణ తప్పదు...

"నాకు నీ స్నేహితురాల్ని చూస్తేనే భయంగా ఉంటుంది పార్వతి ఆవిడ బాషే వేరు" అన్నాడు వాలుకుర్చీలో పడుకుని శూన్యంలోకి చూస్తూ సిగరెట్టు కాలుస్తున్న కృష్ణమూర్తి. "పిల్లల గురించి ఇంత గొడవేమిటి? ఏదో సైకిక్ డామేజి అంటూ మాటలు దొర్లించేస్తుంది."

"వాస్తవం చెప్పడానికి పిల్లల వయస్సుతో పనిలేదు, అంటుంది. అంతేగా?" పదోసారి చీరకుచ్చెళ్ళు సరిగ్గా పెడుతూ అంది పార్వతి. కడుపు ఎత్తు తెలియకుండా ఉండడానికని పెద్దపెద్ద మోడరన్ ప్రింటు చీరలుకొంది. అలాంటి చీరలు కట్టుకుంటే కడుపులో పిల్లలుకూడా జడుసుకుంటారని కృష్ణమూర్తి నమ్మకం. అయినా ప్రేమించే భార్య అభిరుచిని కాదనే అనాగరికుడు కాలేక ఊరుకున్నాడు!

"వాళ్ళకు కావలసిన యదార్థాలు వేరు పార్వతీ. మంచివాళ్ళని దేవతలు ఆశీర్వదిస్తారని, ఊడిన పాలపన్ను ఎలక్కన్నంలో వేస్తే అందంగా తెలువరస వస్తుందని... పార్వతీ, ఏరోప్లేను ఎలా ఎగురుతుంది? నీకు తెలుసా?"

"ప్రిన్సిపల్ తెలుసనుకో..."

"ఎయిలరాన్సు రడ్డరు; ప్రొపెల్లరు అంటూ ఇవి ఎంత విసిగిస్తాయి? ఎగిరే పక్షిలాంటి దాన్లో మాజిక్ కాస్తా చచ్చి పోలేదూ?... నా చిన్నతనంలో అవి మాజిక్ వల్ల ఎగురు తున్నాయనుకునేవాణ్ని."

"నువ్వనేది నిజమే కృష్ణా. కాని నానిగాడు ఎప్పుడో ఒకప్పుడు ప్రశ్నలు వేయడం ప్రారంభిస్తాడు...అప్పుడు." పార్వతి మాట మధ్యలోనే కట్ చేసి.

"పొద్దుట వాడడిగినలాంటివేనా? - బంతాడుతూ కుక్కలుకూడా స్వర్గానికెడతాయా నాన్నారూ అని అడి గాడులే." నవ్వాడు కృష్ణమూర్తి.

"అలాంటివి కాదు కృష్ణా, పుట్టుక - మరణం... అలాంటివి." నసిగింది పార్వతి.

"క్రిందటివారం అడిగాడే...ఎందుకో హఠాత్తుగా నడుస్తున్న వాడాగిపోయి, అమ్మని పెళ్ళాడకపోతే నేనేమవు తాను నాన్నారూ మీకు!" అని అడిగాడు. మీ పిహెచ్‌డి దీనికేం బదులిస్తుందో చూడాలి." గట్టిగా నవ్వేశాడు కృష్ణమూర్తి.

బట్టలు వేసుకుంటున్న కృష్ణమూర్తికి అర్థంలేని ఆలో చనలు కోకొల్లలుగా రావటం మొదలు పెట్టాయి. ఎందుకీ

డాక్టరేటుగారితో మాట్లాడాలంటే నాకు భయం అను కున్నాడు, వాళ్ళంటే నాకిష్టంలేదా? అనుకున్నాడు...జీవితం లోని యదార్థాలంటే నాకు మనస్సులో ఏ మూలనైనా సిగ్గా?...పిల్లల్ని పిల్లల్లాగా ఉండనివ్వని ఈ సైకాలజీ, ఈ చదువులూ అంటే ఇష్టంలేదు. అంతే అయివుంటుంది అను కుంటూ జోళ్ళు తొడుక్కుని సిద్ధం అయిపోయాడు కృష్ణమూర్తి.

నానిగాడ్ని పక్కింటి పిల్లాడితో ఆడుకుంటూ ఉండ మని పురమాయిస్తూంది పార్వతి. వాణ్ని బ్రతిమాలక్కర లేదని తెలుసు. అయినా తల్లిగా ఏదో చెప్పాలని పార్వతి తాపత్రయం. తల్లీ తండ్రీ బయటికి వెడితే స్వేచ్ఛగా ఆడుకో వచ్చు. పక్కింటి కుర్రాడ్ని తన్ని వాడి గోళీలు లాక్కోవచ్చు నని నానిగాడికి తెలుసు. అందుకే ఎంతో సరదాగా ఉండి పోతానంటూ గెంతేశాడు...

కారు తోలుతున్నాడన్న మాటేగాని కృష్ణమూర్తి మనస్సు ఏమిటో ఆలోచిస్తూనే ఉంది. ఉన్నట్టుండి "మరి వీళ్ళ ఊహాలోకం ఇంకేమైపోతుంది?" అని అడిగాడు.

"ఏమై పోతుందేమిటి?"

"ఇప్పటి పిల్లలు మన తరంకంటే తెలివైనవాళ్ళే ఒప్పుకుంటాను. ఏమిటంటారు దాన్ని? బెటర్ ఎడ్జస్టెడ్ అని కదూ?"

పార్వతి నవ్వుకుంది.

"చూడు పార్వతీ జీవితంలోంచి మర్మాలనీ, రహస్యా లనీ తొలగించివేస్తే వాటితోపాటే కొంత అందంకూడా పోదా?"

"డాక్టరుగారి నల్లనంచిలో ఏం అందంఉంది బాబూ... రహస్యంతోపాటు అందంకూడా పోయినా - ఉల్కల పతనమే పిల్లలు - అన్నదానికి మించినదేమిటి నీ నల్లనంచీ?" కృష్ణమూర్తికేసి కుతూహలంగా చూసింది పార్వతి.

తను విన్నదేమిటా అని వింతపడ్డాడు కృష్ణమూర్తి.

"నిజంగానా? ఆకాశంలోంచి పసివాళ్ళు పడతారనుకునే దానివా పార్వతీ?" ఆశ్చర్యం దాచుకోలేకపోయాడు కృష్ణమూర్తి "ఇది నేనెప్పుడూ వినలేదు సుమీ" అన్నాడు.

"మా అమ్మమ్మ స్నేహితురాలు చెప్పిందోసారి,.. అప్పుడది ఎంతో బాగుందనిపించింది" అంది నెమ్మదిగా.

"పిచ్చి, చెట్లవెనకా పుట్లవెనకా పిల్లలు దొరుకుతారన్నా, కోరుకున్నవారికి కల్లో దేవతలు తెచ్చి యిచ్చేస్తారన్నా...కొంచెం అర్థంఉంది. కాని రాలిన తారలు పాపలవుతారన్న నీ నమ్మకం - మైగాడ్ ! ... నీలాంటి దాన్నా నేను ప్రేమించి పెళ్ళిచేసుకున్నాను!" అన్నాడు కృష్ణమూర్తి.

"మళ్ళీ ఓ సారను కృష్ణా" అతని భుజంపై తల వాలుస్తూ అడిగింది పార్వతి.

తల పక్కకివంచి తన చెంపతో నెమ్మదిగా ఒత్తుతూ "ఏమిటి?" అని అడిగాడు కృష్ణమూర్తి.

"ప్రేమించి పెళ్ళాడానని" అంది పార్వతి.

కారు సరస్వతమ్మగారి కాంపౌండులోకి తిప్పాడు కృష్ణమూర్తి వాళ్ళింట్లో అలికిడే లేదు. "ముందు చెప్పిరావలసింది" అంది పార్వతి నొచ్చుకుంటూ.

"నాకెలా తెలుస్తుంది. పోనీలేద్దూ అలా తిరిగి ఇంటికి వెళ్ళిపోదాం. ఈసారి చూడచ్చు." అంటూ సన్నగా యీల

వేస్తూ కారు బీదిరోడ్డువైపు తిప్పాడు కృష్ణమూర్తి. సైకాలజీ డాక్టరేటు యింట్లో లేకుంటే గుండెలమీదనుంచి బరువు దింపేసినట్టయింది కృష్ణమూర్తికి.

లవర్స్ పాత్‌లో చేయీ చేయీ పట్టుకు నడిచారు. గుత్తులు గుత్తులుగా గుల్‌మొహార్‌ల సువాసనతో గాలి నిండి పోయింది... మాటలు అక్కరలేకుండానే నిండిన హృదయా లయిపోయాయి వారివి.

"ఇంకపోదాం, నానిగాడేం చేస్తున్నాడో" అంది పార్వతి.

గుల్‌మొహార్‌ల ముదురాకుపచ్చ ఆకులు చీకట్లో నల్లగా ఉన్నాయి. తెల్లని పూలగుత్తులు వెన్నెల ముద్దల్లాగా ఉన్నాయి. ఇటూ అటూ చూసి పార్వతినోసారి దగ్గరకు తీసుకున్నాడు కృష్ణమూర్తి.

కారు ఇల్లు చేరేసరికి చిన్న ఎత్తు యుద్ధంలో ఉన్నాడు నానిగాడు. పక్కింటివాళ్ళ కుర్రాడ్ని కిందపడేసి కంసునిమీద బాలకృష్ణుడిలా కూర్చుని– "చెప్పు, నే చెప్పిందే రైటని చెప్పు" అంటున్నాడు. ఇంకా ఇద్దరు ముగ్గురు కుర్రాళ్ళు చూస్తూ నిలబడిఉన్నారు. కారు గేటు కవతల ఆపి వింతగా చూస్తున్నాడు కృష్ణమూర్తి. తలుపు తెరచుకుని గబగబా నడవబోయిన పార్వతి చేయి పట్టుకుని ఆపాడు.

"డాక్టరు తెచ్చాడా నిన్ను? పిచ్చివెధవ్వి నువ్వు విత్తనంనుంచి పుట్టావు. ప్రాణంఉండే ప్రతిదీ అలా విత్తనం నుంచే పుట్టుతుంది" అంటున్నాడు కంసుడు.

"ఎవరా కుర్రాడు పార్వతీ." నెమ్మదిగా అడిగాడు కృష్ణ.

"మన పక్కింటి సుబ్బాయమ్మగారి మనవడు. వాళ్ళ నాన్నకి వ్యవసాయశాఖలో పని!" నెమ్మదిగా నవ్వింది పార్వతి...

"విను..." అన్నాడు కృష్ణమూర్తి. "మన పని తేలికైంది చూశావా?" అన్నాడు ఆమె చేయి నొక్కుతూ.

"నీకింత తెలిస్తే గింజలెక్కడ తెస్తారోయ్?" కోపంతో వణికిపోతూ అరుస్తున్నాడు నానిగాడు...

"బజార్లో కొనుక్కుంటారు." అన్నాడు కంసుడు.

"చూశావా పార్వతీ, కుర్రాళ్ళేం మారిపోలేదు ఈ కాలంలో. వాళ్ళకెంతదాకా అర్థం అవుతుందో అంతదాకానే అర్థం చేసుకుంటారు. అందుకే నాకు డాక్టర్లంటే..."

కృష్ణమూర్తి మాట ముగియకుండానే.

"అదుగో ఓ నక్షత్రం రాలుతోంది" మెరిసే కళ్ళతో పైకి చూసింది పార్వతి. వెలుగుచుక్కలా కిందికి త్వరితంగా జారిపోతూంది ఓ నక్షత్రం. ఎక్కడ పడుతుందో మరి.

"ఎక్కడో ఇంకో పాప!" అంటూ లోపలికి దారి తీసింది నానిగాన్ని లేవతీద్దామని పార్వతి.

---